అదరగొట్టే ఆట.. పతకాల వేట



పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోటీ ఏదైనా బాలికలు అన్ని రంగాల్లోనూ 'రాణి'స్తున్నారు. క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఒకప్పుడు మగ మహారాజులకే సొంతం అనుకున్న ఆటల్లోనూ తమ ప్రత్యేక చాటుకుంటున్నారు. పురుషులకు దీటుగా ప్రతిభ చూపుతున్నారు. ఆశయాలను సాధిస్తూ అన్నింటా తామేనంటూ దూసుకుపోతున్నారు. పాయకరావుపేటలో ప్రస్తుతం అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు జరుగుతున్నాయి. పతకాల వేటలో తగ్గేదే లేదంటున్న నవతరం క్రీడాకారుల విశేషాలు

... 6లో

శతాధిక వృద్ధురాలి మృతి



నక్కా కాసులమ్మ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని రామారాయుడుపాలెంలో శతాధిక వృద్ధురాలు నక్కా కాసులమ్మ (105) గురువారం మృతిచెందారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమె కుటుంబ సభ్యులు 96 మంది ఉన్నారు. అంత్యక్రియులకు మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. శాకాహారం, పరిమితంగా భోజనం చేయడం ద్వారా ఎక్కువకాలం జీవించిందని ఈమె బంధువు సుంకర మరిడేశ్వరరావు తెలిపారు.

పరిశ్రమల్లో భద్రత ఎంత...!


ఓవైపు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. మరోవైపు పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టు నెలలో ఎసెన్షియా, సినర్జిన్ కంపెనీల్లో జరిగిన వరుస ప్రమాదాలతో కూటమి సర్కారు పరిశ్రమల్లో భద్రతపై దృష్టిసారించింది. ఇప్పటికే విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా అధ్యక్షతన హైపవర్ కమిటీని నియమించింది. ఆ బృందం రెండు పరిశ్రమలనూ పరిశీలించి ఉన్నతాధికారులతో సమీక్షలు జరిపింది. తాజాగా మిగతా కంపెనీల్లోనూ భద్రత ప్రమాణాల అమలుపై జిల్లా స్థాయి అధికారుల బృందం విస్తృత తనిఖీలకు శ్రీకారం చుట్టింది. ఎనిమిది శాఖల అధికారులు వారంలో మూడు రోజుల పాటు ఈ తనిఖీలు చేపట్టాలి. అనకాపల్లి జిల్లా పరిధిలో సుమారు 200 పైగా రెడ్ కేటగిరీ పరిశ్రమలున్నాయి. వీటన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలుంటే సరిదిద్దాలి.. భవిష్యత్తులో ప్రమాదాలు జరకుండా సూచనలు చేయాల్సి ఉంటుంది.



- ★ ఎనిమిది శాఖల అధికారులతో విస్తృత తనిఖీలు
- ★ ప్రమాదాల నివారణ దిశగా సర్కారు చర్యలు

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అచ్యుతాపురం

పరిశ్రమల్లో భద్రత అనేది యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు సమష్టి కృషితోనే సాధ్యమవుతుంది. యాజమాన్యాలు విధిగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాలి. ముఖ్యంగా నిర్దిష్టమైన పని చేసే విధానం (ఎస్‌ఓపీ) సక్రమంగా అమలుచేయాలి. యంత్ర పరికరాల్లో నాణ్యతా లోపాలు, ఉద్యోగులు, కార్మికులకు సరైన అవగాహన లేకపోవడం, సుశిక్షితులైన వారిని నియమించుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాస్తవానికి కంపెనీల్లో 98 శాతం మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంది. 'పక్క కంపెనీలో కదా ప్రమాదం జరిగింది.. మాకేం సంబంధం?' అని నిర్లక్ష్యం చేయకూడదు. 'ఆ కంపెనీలో ప్రమాదం ఎందుకు జరిగింది.. మన పరిశ్రమలో అలాంటి పరిస్థితులు ఏమైనా ఉన్నాయా?' అని పరిశీలించి చర్యలు తీసుకున్నప్పుడే వాటిని అరికట్టడానికి వీలవుతుంది.



భద్రతా చర్యలు గాలికి వదిలేశారు..

వైకాపా హయాంలో కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు.. నడుస్తున్న వాటిని పరిశీలించిందీ లేదు. గత అయిదేళ్లలో జరిగిన ప్రమాదాలే దీన్ని నిరూపిస్తున్నాయి. ఎల్జీ పాలిమర్స్‌లో విషవాయువులు విడుదలైన తర్వాత విపత్తుల నిర్వహణ శాఖ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై గెజిట్ రూపొందించింది. దాన్ని వైకాపా సర్కారు తొక్కిపెట్టింది. థర్డ్‌పార్టీ వాళ్లకు సేఫ్టీ ఆడిట్ బాధ్యతను కట్టబెట్టింది. ఫ్యాక్టరీస్ అధికారులు, ఏజెన్సీలు కుమ్మక్కై అందినంత దండుకుని నివేదికలు ఇచ్చారు.



2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు

ప్రమాద రకం	ఘటనలు	చనిపోయినవారు
పేలుడు, అగ్ని ప్రమాదం	26	59
విషవాయువుల విడుదల	8	10
విద్యుత్తు ప్రమాదాలు	7	7
ఎత్తు నుంచి పడడం	14	15
యంత్ర సంబంధిత ప్రమాదం	3	3
ఇతర ప్రమాదాలు	20	22
మొత్తం	**78**	**116**

అనకాపల్లి జిల్లాలో పరిశ్రమలు

కేటగిరి	సంఖ్య
రెడ్	271
ఆరెంజ్	197
గ్రీన్	76
మొత్తం	**544**
జిల్లాలో ప్రమాదకర పరిశ్రమలు	204

మూడు నెలలపాటు తనిఖీలు..

ఓ వైపు హైపవర్ కమిటీ తనిఖీలు చేపడుతోంది. మరోవైపు పరిశ్రమలు, కాలుష్య నియంత్రణమండలి, కర్మాగారాలు, ఔషధ నియంత్రణ, బాయిలర్స్, ఏపీఐఐసీ, అగ్నిమాపక, కార్మికశాఖల అధికారులు సంయుక్తంగా అన్ని కంపెనీలను పరిశీలించనున్నారు. రోజుకు మూడు పరిశ్రమల చొప్పున వారంలో మూడు రోజుల పాటు ఈ తనిఖీలు చేపట్టాలి. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు శాఖల వారీగా తనిఖీలు చేసి యాజమాన్య ప్రతినిధులతో సంతకాలు తీసుకుంటారు. జిల్లాలో 200 పైగా పరిశ్రమలుండడంతో మూడు నెలల పైగానే ఈ తనిఖీలు కొనసాగనున్నాయని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ నారాయణ 'ఈనాడు'కు తెలిపారు.



ఎసెన్షియా కంపెనీలో ప్రమాద ప్రాంతాన్ని ఇటీవల పరిశీలించిన ఉన్నతస్థాయి బృందం

'భవిష్యత్తులో వైకాపా కనుమరుగు'



పాయకరావుపేటలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అవినీతి, అరాచకాలతో పుట్టిన వైకాపా భవిష్యత్తులో కనుమరుగవుతుందని అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని పి.ఎల్.పురంలో ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక సభ్యులు ఉన్నది భాజపాలోనేనని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా ఎదిగిందన్నారు. అనకాపల్లి పార్లమెంటరీ పరిధిలో సుమారు 4 లక్షల మందిని పార్టీ సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామీణ స్థాయిలో తెదేపా, జనసేన నాయకులతో భాజపా నాయకులు కలిసి పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో కూటమిని ప్రజలు ఆదరించారని తెలిపారు. జగన్ చేసిన పాపాలు పండే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. ఇప్పటికే వైకాపా ప్రధాన నాయకులు జగన్‌ను వదిలి బయటకు వచ్చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కర్రి చిట్టిబాబు, సురేంద్రమోహన్, రవిరాజు, శ్రీరంగం రమేష్, కోసూరి శ్రీను, కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం, షీల్డ్ అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేత్రదానంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానాల్లో నిలిచిన ఐదుగురికి కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ విజయకృష్ణన్ ప్రశంసాపత్రం, షీల్డ్ అందించి అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డి.రమణకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితమనుకుని ఉవ్విళ్లు.. తీరా వసూళ్లు





గ్యాస్ డీలరు ఇంటింటికీ వెళ్లి వినియోగదారుని ఖాతాతో ఫోన్ నంబరు అనుసంధానం ఉచితంగా చెయ్యాలి. ఈ ప్రక్రియ ఏజెన్సీ కార్యాలయానికి వచ్చినప్పుడైనా.. లేదా వినియోగదారుడికి గ్యాస్ అందించినప్పుడైనా చెయ్యాలి. అలా కాకుండా డీలర్లు వినియోగదారుల్ని పంచాయతీ కార్యాలయాలకు పిలిపిస్తున్నారు. ఒక్కొక్కరి దగ్గర రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదంతా తెలియక ఉచిత గ్యాస్ కోసం అనుకొని అందరూ ఒకేసారి ఎగబడుతున్నారు. కె.కోటపాడు మండలం చౌడువాడలో గురువారం కనిపించిన సన్నివేశమిది..

–న్యూస్‌టుడే, కె.కోటపాడు, చిత్రాలు: ఈనాడు, అనకాపల్లి

కల్యాణగిరి.. భక్తజనసిరి



భవానీ మాలలు ధరిస్తున్న భక్తులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సత్యనారాయణపురంలో కల్యాణగిరిపై కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భవానీ దీక్ష స్వీకరించే భక్తులకు ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు మాలలు వేశారు. అనంతరం పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఉచితంగా అన్నప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, ఛైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటిపల్లి కిశోర్, అన్నదానం కమిటీ ఛైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మాలధారణ సామగ్రి, పత్రాలు, పూజా సామగ్రిని వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ ఛైర్మన్ ఆడారి కుమారస్వామి, సరోజిని దంపతులు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

రూ.వంద కోసం గొంతుకోశాడు!



గాయపడిన నూకిరెడ్డి శ్రీనివాస్



నిందితుడు బంగారు వెంకటరమణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: మద్యం తాగడానికి ఇచ్చిన రూ. 100 తిరిగి ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో బ్లేడ్‌తో దాడి చేసిన ఉదంతం ఎలమంచిలి మండలం కొత్తలి గ్రామంలో గురువారం వెలుగు చూసింది. ఎలమంచిలి గ్రామీణ ఎస్సై ఉపేంద్ర కథనం ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన బంగారు వెంకటరమణ ఇదే గ్రామానికి చెందిన నూకిరెడ్డి శ్రీనివాస్‌కు గతంలో రూ.100 అప్పు ఇచ్చాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగాడు. ఈ సమయంలో గ్రామ నడిబొడ్డున ఇద్దరూ ఘర్షణ పడ్డారు. డబ్బులు ఇవ్వకపోగా శ్రీనివాస్ తిరగబడ్డాడు. దీంతో వెంకటరమణ గ్రామంలోని ఒక షాపు వద్ద బ్లేడ్ కొని శ్రీనివాస్ మెడ, తలపై కోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని ఎస్సై వెల్లడించారు. గతంలో ఓ బాలికను వేధించినందుకు ఇతడిపై పోక్సో కేసు నమోదైందని ఆయన తెలిపారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



గౌరీపరమేశ్వరుల అమ్మవారు



రథం లాగుతున్న సీఎం రమేశ్ తదితరులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: గవరపాలెం శ్రీమహాలక్ష్మి దేవి ఆలయంలో గురువారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీని ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, నాయకులు దాడి రత్నాకర్, భాజపా జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, గంగారాం, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోటివల్లి శ్రీను, విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు కోటివల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ నరసింహాచారి పాల్గొన్నారు. గవరపాలెం శ్రీగౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల అమ్మవారు గురువారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఎంపీ సీఎం రమేశ్ అమ్మవారిని దర్శించుకున్నారు. గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, సురేష్ పాల్గొన్నారు.

మాడుగుల-విశాఖ రహదారి విస్తరణ

80 అడుగులకు ప్రతిపాదనలు

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాలను విశాఖకు అనుసంధానం చేస్తూ 80 అడుగులకు రహదారి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులతో కలిసి గురువారం విస్తరణ ప్రతిపాదిత మార్గంలో పర్యటించారు. కె.కోటపాడు నుంచి దేవరాపల్లి మండలం కలిగొట్ల, చీడికాడ మండలం అర్జునగిరి మీదుగా మాడుగుల చేరుకున్నారు. ఆయా మండలాల అధికారులు, కూటమి నాయకులతో కలిసి చర్చించారు. ఈ రోడ్డును రెండు దశల్లో నిర్మిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, తెదేపా నాయకులు పైలా ప్రసాదరావు, పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ భాస్కరరావు, శరఖాన సూర్యనారాయణ, నానాజీ, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ ప్రతిపాదనపై కలెక్టరు విజయకృష్ణన్, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అదరగొట్టే ఆట.. పతకాల వేట

పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్‌ఈ అంతర్ రాష్ట్ర పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్ అండర్-14, 17, 19 విభాగాల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 1200 మంది తమ ఆటతీరుతో మెప్పిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ క్రీడలపై ఉన్న ఆకాంక్షలను, భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు. ఆ వివరాలివిగో..

– పాయకరావుపేట, న్యూస్‌టుడే



కబడ్డీలో తలబడుతున్న మహిళా క్రీడాకారులు

జాతీయస్థాయిలో సత్తా చాటాలి



ఆటల్లో జాతీయస్థాయిలో సత్తా చాటాలన్నదే మా లక్ష్యం. మంచి క్రీడాకారిణులుగా పేరు తెచ్చుకోవాలి. దానికోసం ఉపాధ్యాయుల కఠోర శిక్షణ తీసుకుంటున్నాం. పతకాలు సాధించడమే మా కోరిక.

– జె.సుస్మి, ఆర్.సుమన, భువనగిరి, తెలంగాణ

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే..



ఆటల్లో ప్రతిభ చూపడంలో కుటుంబసభ్యుల ప్రోత్సాహం కీలకం. వెన్నంటి నడిపిస్తుండటంతో వాలీబాల్‌లో రాణిస్తున్నాను. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వాలీబాల్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నా. జట్టు విజయంలో ముందుండి నడిపిస్తున్నా. వాలీబాల్ రాణించాలంటే కోర్టులో చురుగ్గా ఉండాలి. మంచి క్రీడాకారిణిగా నిలదొక్కుకోవాలన్నదే నా లక్ష్యం.

– ఎస్.సహస్రరెడ్డి, నెల్లూరు

మానసిక దృఢత్వంతోనే..



చిన్నప్పటి నుంచి వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం. నిత్యం సాధన చేయడంతో ఆటపై పట్టు సాధించగలిగాం. శారీరక, మానసిక దృఢత్వం క్రీడలతో మన సొంతమవుతుంది. ముఖ్యంగా జయాపజయాలను ఒకేలా తీసుకునే శక్తి అలవడుతోంది. వాలీబాల్‌లో రాష్ట్రస్థాయిలో మూడుసార్లకు పైగా బహుమతులు గెలుచుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కోరికతో చదువు కొనసాగిస్తున్నాం.

– పి.ఎస్.దీప్తి, బి.ఇక్షిత, అనంతపురం

శిక్షణతో సాధిస్తున్నాం



గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చాం. పాఠశాలలో ఉచితంగా విద్య, వసతి కల్పించడంతో చదువు కొనసాగిస్తున్నాం. ఆటల్లోనూ ప్రతి రోజూ సాధన చేయిస్తున్నారు. దీంతో మిగతా క్రీడాకారులతో సమానంగా సత్తా చాటుతున్నాం. ఆరంభంలో కాస్త బెరుగ్గా ఉండేవాళ్లం. క్రీడలపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. జిల్లా స్థాయిలో బహుమతుల రాకతో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రతి పోటీలోనూ ప్రతిభ చూపుతున్నాం.

– ఎం.భాను, సీహెచ్.చరిణి, తూర్పుకన్పూరు, తిరుపతి జిల్లా

సమాన ప్రాధాన్యమిస్తున్నాం..



చదువులో ప్రతిభ చూపుతూనే ఆటలకు సమాన ప్రాధాన్యమిస్తున్నాం. కబడ్డీలో గెలుపు సాధించాలంటే చిరుతలా కదలాలి. ప్రత్యర్థి జట్టు వెన్నులో పుట్టేలా వేగవంతమైన కదలికలతో బోల్తా కొట్టించాలి. ఇది సాధించాలంటే కసరత్తులే ముఖ్యం. వ్యాయామ శిక్షకుల ప్రోత్సాహంతో విజయాలు సాధిస్తున్నాం. జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు సొంతం చేసుకుంటున్నాం. క్రీడాకోటాలో ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయం.

– నాగలలిత, ఎన్.జాహిత, రాజమహేంద్రవరం

శ్రమించాల్సిందే



కబడ్డీలో ఆడటం ఆషామాషీ కాదు. ఎంతో శ్రమించాలి. సాధనలో చెమటోడ్చాల్సిందే. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. చదువుకు సమయాన్ని కేటాయిస్తూనే ఆటలో మెలకువలు నేర్చుకున్నాం. ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం మంచి విజయాలు సాధిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో మూడుసార్లు ప్రథమ బహుమతి సాధించాం.

– డి.నవ్యశ్రీ, ఎం.సాయివైష్ణవి, ఖమ్మం

విజయాలే స్ఫూర్తిగా..



ప్రాంతమేదైనా వాలీబాల్ కోర్టులో దిగామంటే విజయమే గురి. విజయాలే స్ఫూర్తిగా దూసుకుపోతున్నాం. వాలీబాల్ ఆడాలంటే శారీరకంగా ఎంతో శక్తి అవసరం. ఒక్కొసారి గాయాలవుతుంటాయి. వీటన్నింటినీ అధిగమించి జట్టు గెలుపునకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. అపహాస్యం చేసిన వారే మెచ్చుకునే రీతిలో సత్తా చాటుతున్నాం. మగవారికి దీటుగా మహిళలు ప్రతిచోటా ముందంజలో ఉన్నారు. పోటీ పరీక్షల్లో సత్తా చాటుతాం. ఆటల్లోనూ ప్రత్యేకత నిలుపుకొంటాం.

– ఎం. సంయుక్త, బి.భవ్య, హైదరాబాద్

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కార్యకర్తకు సైకిల్ గుర్తును అందజేస్తున్న ప్రగడ, పప్పల, భవాని తదితరులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ పప్పల చలపతి రావు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలో తెదేపా సభ్యత్వ నమోదుపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. రూ.100 చెల్లించి వాట్సాప్ ద్వారా సాధారణ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం అందిస్తామన్నారు. సభ్యత్వ నమోదులో ఎలమంచిలిని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందన్నారు. తెదేపాలో సభ్యత్వం తీసుకుంటే వేధింపులు పెరుగుతున్నాయని కొందరు వాపోయారు. ఇప్పటికే జనసేన సభ్యత్వం కొందరు తీసుకున్నారని ఇప్పుడు తెదేపా సభ్యత్వం తీసుకోవాలా? అని సందేహం వ్యక్తం చేశారు. దీనిపై పప్పల మాట్లాడుతూ ఏదో ఒకపార్టీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఎలమంచిలిలో తెదేపా సభ్యత్వం తగ్గిపోతే జనసేన బలపడినట్లు అవుతుందన్నారు. తెదేపా సభ్యత్వం అధికంగా చేయించి ఎలమంచిలిలో తెదేపా సత్తాను నాయకత్వానికి తెలిసేలా చేయాలని పప్పల కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

తమ పరిస్థితేంటో చెప్పాలి?

తెదేపా అధికారంలోకి వచ్చినా తమలో ఆనందం లేకుండా పోయిందని తమ పరిస్థితి ఏమిటో? అర్థం కావడంలేదని కొందరు తెదేపా నాయకులు, కార్యకర్తలు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా బలహీనపడుతుందని విచారం వ్యక్తం చేశారు. కార్యకర్తల బాధలను చెప్పుకొన్నా పరిష్కారం అయ్యే మార్గం కనిపించడంలేదన్నారు. తెదేపాకు కంచుకోటైనా ఎలమంచిలి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులను అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రగడ నాగేశ్వరరావు అందుబాటులో ఉన్నా అధికారం లేకపోవడంతో ఏమిచేయలేకపోతున్నారన్నారు. దీనిపై పార్టీ పెద్దలకు వివరించాలని కార్యకర్తలు కోరారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్‌కుమార్, రంగనాయకులు, సాయికృష్ణ, బాపునాయుడు, డ్రీమ్స్ నాయుడు, తులసీరామ్, జనపరెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

117 జీఓను వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వం 117 జీఓను రద్దు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. ఏపీటీఎఫ్ భవనంలో గురువారం సంఘ జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల కోసం వేతన సవరణ కమిటీని నియమించాలన్నారు. ముందస్తు పరిహారంగా ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. సీపీఎస్‌కు రద్దుతో పాటు పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరవాత ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్ల గలుగుతున్నామన్నారు. గతంలో ఆ పరిస్థితులు లేవన్నారు. ఒకటో తేదీన జీతాలు, పింఛన్లను అందజేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ ఒత్తిడి నుంచి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను తప్పించాలని కోరామని, గత ప్రభుత్వంలో లేని విధంగా విద్యా మంత్రి, ఉన్నతాధికారుల్లో మార్పు వచ్చిందన్నారు. సెలవుల విషయంలోనూ సూచనలు, సలహాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోందన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం మారినా ఇంకా కొందరు పాత అధికారుల్లో ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు నూకరాజు, అప్పారావు, మహాలక్ష్మినాయుడు, జయలక్ష్మి, మోబినా, గణేష్, శ్రీనివాస్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మినీ గోకులాల్లో రూ.5.89 కోట్ల దుర్వినియోగం

ముగ్గురు అధికారులపై అభియోగాలు

ఈనాడు, అనకాపల్లి: పాడి పశువుల సంరక్షణార్థం గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మినీ గోకులాల్లో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. పశుసంవర్ధక శాఖకు చెందిన అధికారులు లబ్ధిదారులతో సంబంధం లేకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీకి రూ.కోట్లలో బిల్లులు చెల్లించేశారు. దీనిపై ఫిర్యాదులు అందగా విచారణ నిర్వహించి ముగ్గురు అధికారులను బాధ్యులుగా గుర్తించారు. అప్పట్లో పశుసంవర్ధక శాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన జి.వెంకటస్వామి, అరకులోయ అదనపు సంచాలకులుగా పనిచేసిన డా.అశ్వత్థామ, డుంబ్రిగుడ పశువైద్యాధికారిగా పనిచేసిన జి.గౌతమ్‌ను ఇదివరకే సస్పెండ్ చేశారు. తాజాగా విచారణలో గుర్తించిన అంశాలు ఆధారంగా ఈ ముగ్గురు అధికారులపై అభియోగాలను నమోదు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్ ఉత్తర్వులిచ్చారు. మినీగోకులాల చెల్లింపుల్లో రూ.5.83 కోట్ల మేర నిధులు దుర్వినియోగం జరిగిందని, వాటికి ఈ ముగ్గురు అధికారుల నిర్లక్ష్యం, సహకారమే కారణమని అభియోగాల్లో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారులకు తెలియకుండా బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌కు ఎందుకు చెల్లించారో పక్షం రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వాటి ఆధారంగా తదుపరి చర్యలుంటాయన్నారు.

నేటితో క్రీడా పోటీల ముగింపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సీబీఎస్‌ఈ క్లస్టర్-7 అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలు రెండోరోజూ హోరాహోరీగా సాగాయి. పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం వందలాది మంది క్రీడాకారిణులు వాలీబాల్, కబడ్డీ పోటీల్లో తలపడ్డారు. ఆద్యంతం మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. విజయం కోసం బాలిలంతా కొదమ సింహాల్లా పోటీ పడ్డారు. అండర్-14,17,19 విభాగాల్లో పలు మ్యాచులు జరిగాయి. శుక్రవారంతో పోటీలు ముగుస్తాయని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. బహుమతి ప్రదానోత్సవానికి హోం మంత్రి అనిత హాజరవుతారని వివరించారు.

బార్క్ సమస్యలపై జేసీ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా పెండింగ్‌లో బాబా అణు విద్యుత్తు పరిశోధన కేంద్రం సమస్యలపై జేసీ జాహ్నవి గురువారం సమీక్ష నిర్వహించారు. బార్క్, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో కలిసి భూములు, రోడ్డుకు కేటాయించిన స్థలాలను దొప్పెర్ల, నాగవరం పరిధిలో పరిశీలించారు. నిర్వాసిత రైతులకు చెల్లించాల్సిన పరిహారం, రైతుల అభ్యంతరాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై చర్చించారు. వీటితోపాటు 22ఏ జాబితాలో ఉన్న భూములపై ఆరా తీశారు. రైతుల భూములను 22ఏ నుంచి తప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యతో పాటు సీఎస్‌ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల్లో ఖర్చు చేయడంలేదని రైతులు వాపోయారు. బార్క్ రోడ్డు నిర్మాణానికి ముందే ఇంటి స్థలాలు కొనుగోలు చేశామని ఇప్పుడు గజాల్లో డబ్బులు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని మరికొందరు వాపోయారు. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న లేఅవుట్లు, రైతులు భూముల్లోకి వెళ్లకుండా కంచెను వేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నీ విన్న ఆమె పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌డీసీ రమామణి, ఆర్డీఓ చిన్నికృష్ణ, ఇన్‌ఛార్జి తహసీల్దార్ నీరజ, జెడ్ఎం హరిప్రసాదరావు, ఆర్ఐ కుమార్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్ట్

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతిని చేసి మోసగించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విభీషణరావు గురువారం తెలిపారు. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొత్తూరు నాగదేవ ఎస్.రాయవరం మండలంలోని రొయ్యల పరిశ్రమలో క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న యువతిని ప్రేమ, పెళ్లి పేరుతో లోబర్చుకుని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి నాగదేవను అడగగా, మొహం చాటేశాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరిశ్రమలో ప్రమాదం..

ముగ్గురు కార్మికులకు గాయాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కేఎన్ ఆర్‌పేటలోని అల్యూమినియం, ఐరన్ స్ట్రక్చర్స్ తయారుచేసే పరిశ్రమలో గురువారం ప్రమాదం చోటు చేసుకుని ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి గ్రామీణ స్టేషన్ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. పరిశ్రమలో స్ట్రక్చర్స్ తయారీ అనంతరం దాని సామర్థ్య పరీక్షకు ఇటుకలను వేసి బరువు ఎంత కాస్తుందో పరీక్ష చేస్తారు. ఈ సమయంలో ఇటుకలు జారిపడి అక్కడే ఉన్న కార్మికులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో దినేష్, శేఖర్, సాయి అనే కార్మికులకు గాయాలయ్యాయి. వీరిని అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు లారీల్లో 230 ఆవులు

స్థానికుల సమాచారంతో అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు




లారీల్లో ఆవులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గోవులను అక్రమంగా తరలించేందుకు లారీ వెనుక భాగంలో రెండు కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. పరిమితికి మించి ఆవులను ఎక్కించారు. బయటకు కనిపించకుండా టార్పాలిన్లు కప్పేశారు. ఒక్క లారీకీ నంబరు ప్లేటు లేదు. నాలుగు లారీల్లో 230 ఆవులు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కు గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీలను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో ఒకదాని వెనుక లారీలు వెళ్తుండగా రమేష్ అనే వ్యక్తి మేడపై నుంచి చూసి స్థానిక భాజపా నాయకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన నాయకులు దూది రాజేష్, గొంతిన ఈశ్వరరావు, సయ్యపురెడ్డి మణికంఠ, సీతా నాగరాజు, ముక్కా దేముడుబాబు కూడలికి చేరుకుని అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు చెప్పారు. అందరూ కలిసి లారీలను వెంబడించి అడ్డుకున్నారు. వాటిని బుచ్చెయ్యపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. నలుగురు లారీ డ్రైవర్లు తెలంగాణకు చెందిన వారు, క్లీనర్లు ఒడిశా, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు. ఆవులను గోశాలలకు తరలిస్తామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాద ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. అనకాపల్లి సుంకరమెట్ట రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ట్రాఫిక్ ఎస్సై శేఖరం కథనం ప్రకారం సీహెచ్ఎన్ అగ్రహారానికి చెందిన కోరుకొండ సురేష్ (19) కొప్పాక నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. సుంకరమెట్ట వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి చంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంతలో పడి ఒకరు..



నక్కపల్లి: ఉపమాక సమీపంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతిచెందాడని సీఐ కుమారస్వామి గురువారం తెలిపారు. వి.మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారానికి చెందిన **ముత్తా గోవిందరావు (40)** హెటెరో కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండవెనుకపాలెం సమీపంలో గుంతలో పడి వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో విచారణ చేయగా, గోవిందరావుగా గుర్తించారు. ఆ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

పోలవరం కాలువలో పడి వృద్ధుడు..



డొంకాడ గ్రామానికి చెందిన వృద్ధుడు పోలవరం కాలువలో మునిగి మృతి చెందినట్లు సీఐ కె.కుమారస్వామి తెలిపారు. **కడింపల్లి సత్యనారాయణ (62)** బుధవారం సాయంత్రం గేదెను తీసుకురావడానికి కాలువ గట్టు వెంట వెళ్లారు. బాగా చీకటిపడినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించి గురువారం ఉదయం వెతకగా కాలువ గట్టు వద్ద దుస్తులు కనిపించాయి. కాలువలో పరిశీలించగా, మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కె.కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న ఉద్యోగ మేళా

అచ్యుతాపురం: స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో యొకహోమా కంపెనీలో ఉద్యోగాలకు ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్ ప్రసాద్ తెలిపారు. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు.

ఏయూలో డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్

విశాఖపట్నం: డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. వివరాలకు www.audoa.andhrauniversity.edu.in వెబ్‌సైట్ పరిశీలించవచ్చు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	112	108
లైవ్	134	128
డ్రెస్‌డ్	194	226
స్కిన్‌లెస్	221	236

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా, పరిషా: కలి సత్యనారాయణ ప్రీమియ-51: రామ్‌నగర్ బన్నీ, వెంకటేశ్వర: దేవర, శ్రీ సత్య: జెంటిల్‌మేన్, రామచంద్ర: స్వాగ్, సత్యనారాయణ ప్రీమియ-2: మత్తు వదలరా పిల్లియా: సత్యం సుందరం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: శ్రీబాలాజీ విలేజ్ సినిమా ప్రీమియ-1లో సత్యం సుందరం, ప్రీమియ-2లో దేవర

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ భక్తిశ్రద్ధలతో సాగింది. కావడిని తిరువీధుల్లో సన్నాయి, వాయిద్యాల నడుమ ఊరేగించారు.



వన్యప్రాణులను కాపాడండి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వన్య ప్రాణులను కాపాడాలని కోరుతూ ఎలమంచిలి అటవీశాఖాధికారులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వన్య ప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం చేపట్టారు. మానవ హారంగా ఏర్పడి ప్లకార్డులు ప్రదర్శించారు. అన్ని రకాల జంతువులు ప్రకృతిలో ఉంటేనే సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. వీటిని వేటాడితే కఠినచర్యలు తప్పవన్నారు. అధికారులు రమణ, వేణుకుమారి పాల్గొన్నారు.



అటవీశాఖాధికారులు, సిబ్బంది ర్యాలీ

చిరు వ్యాపారులకు చేయూత

స్వనిధి రుణాలతో మెరుగైన జీవనోపాధి

• అనకాపల్లికి చెందిన పండ్లు అమ్ముకునే వ్యాపారి ప్రైవేటుగా రూ. 4 చొప్పున వడ్డీకి తీసుకున్నారు. రోజూ అమ్మగా వచ్చిన లాభం వడ్డీ కట్టడానికే సరిపోతుంది.

• ప్రధాన రహదారిలో నూడిల్స్ వ్యాపారానికి అప్పు చేశాడు. అధిక వడ్డీలకు తేవడంతో ఇవి తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

– న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం


అనకాపల్లిలో చిరువ్యాపారులు

ఎంతోమంది చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారానికి పెట్టుబడి నిమిత్తం చేసిన అప్పులు తీర్చడం వీరికి భారంగా మారుతోంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పీఎం స్వనిధి పేరుతో చిరు వ్యాపారులను ఆదుకునే నిధి చేయూతను అందిస్తోంది. ప్రభుత్వ గ్యారెంటీతో తొలుత రూ. 10 వేలు అందించి పావలా వడ్డీతో వీటిని సకాలంలో తీర్చి రూ. 20 వేలు, రూ. 50 వేల వరకు బ్యాంకుల ద్వారా అందిస్తున్నారు. ఏడాది కాల వ్యవధిలో అసలు, వడ్డీతో కలిపి నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది చిరువ్యాపారులకు వరంగా మారింది.


హామీ పత్రాలు ఉంటేనే కానీ బ్యాంకుల ద్వారా రుణం రాదు. దీన్ని ఆసరాగా తీసుకున్న వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు చిరువ్యాపారులకు అప్పులు ఇస్తున్నారు. వీరి నుంచి రోజువారీగా వసూలు చేస్తుంటారు. ఈ తరహా వ్యాపారం అనకాపల్లిలో చాలా ఎక్కువగా ఉంది. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులు తీర్చలేక కొందరు వ్యాపారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ చిరు వ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అధికారుల చొరవతో బ్యాంకుల నుంచి రుణం పొంది చాలామంది వ్యాపారులు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నారు. అనకాపల్లిలో 311 మందిని గుర్తించి వీరికి రుణాలు అందించేలా యూసీడీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన వారిలో సగం మందికిపైగా రుణాలు రాలేదు. కూటమి హయాంలో దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు రుణాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో సర్వే చేయించి చిరువ్యాపారులను గుర్తించి వారితో దరఖాస్తు చేయించి రుణాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.


దరఖాస్తులను బ్యాంకు అధికారిణికి అందజేస్తున్న సిబ్బంది

రూ. 50 వేల రుణం తీసుకుంటున్నా

మా గ్రామంలో చిన్నబడ్డీ పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాను. తొలుత రూ. 10 వేలు రుణం తీసుకున్నాను. ఏడాదిలో నెలనెలా వాయిదాల కింద చెల్లించాను. అనంతరం రూ. 20 వేలు ఇచ్చారు. వీటిని సకాలంలో తిరిగి చెల్లించాను. ఇప్పుడు రూ. 50 వేలకు దరఖాస్తు చేశా! ప్రభుత్వం అందిస్తున్న సాయం మా లాంటి చిరువ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది. వ్యాపార పెట్టుబడికి అవసరమైన నగదు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణం ఇవ్వడం మేలు కలుగుతోంది.

– జి.కన్నారావు, చిరువ్యాపారి, కొప్పాక



అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు

చిరువ్యాపారులు ఎవరైనా సీఎం స్వనిధి రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్‌పీల ద్వారా అనకాపల్లిలో సర్వే చేసి 311 మందిని గుర్తించి వీరికి రుణాలు అందించేలా బ్యాంకులకు దరఖాస్తులు అందించాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సంప్రదించవచ్చు. తక్కువ వడ్డీకి రుణాలు అందించి వ్యాపార వృద్ధికి ప్రభుత్వం తరపున సహకారం అందించి స్వయం ఉపాధి పొందేలా చూస్తాం.

– దొర, యూసీడీ అర్బన్ ప్రాజెక్టు పీడీ



సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 3 నుంచి 13 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సెలవులు ప్రకటించామని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు తెరుస్తున్నట్లు తెలిసిందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కేజీబీవీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు వస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అభ్యర్థుల సహాయార్థం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నంబరు 70750 39990కు ఫోన్ చేసి ఇబ్బందులు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 10 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: దూరవిద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువులు, వర్మి కంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకంపై ఎనిమిది వారాలు ఆన్‌లైన్‌లో కోర్సులు బోధిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు రూ.1,500 ఫీజుగా చెల్లించాలన్నారు. కంప్యూటర్, ఆండ్రాయిడ్ సెల్ ఫోన్ లేదా ఐపాడ్ ఉండాలని చెప్పారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉచితంగా ఇసుక ఇవ్వాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లిలో కార్మికులతో ఆందళన చేపట్టారు.

వరద బాధితులకు విశ్రాంత సీఏపీఎఫ్ సహాయం

కశింకోట, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశ్రాంత సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ (కేంద్ర సైనిక రక్షణ మాజీ బలగాలు) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.25 వేల సాయం అందించారు. గాజువాకలో రాష్ట్ర తెదేపా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు గురువారం చెక్కును అందించారు. అదేవిధంగా సీఏపీఎఫ్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ అధ్యక్ష, కార్యదర్శులు వి.హరినాథ్, జీఎస్‌బీ సుబ్రహ్మణ్యం, రామారావు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అనకాపల్లి పట్టణం, అచ్యుతాపురం, మునగపాక, నక్కపల్లి, న్యూస్‌టుడే: పూడిమడక రోడ్డు కూడలి, డైట్ కళాశాల జాతీయ రహదారి ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం మండలం పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, ఖాజీపాలెం, జగ్గన్నపేట, పూడిమడక, తదితర గ్రామాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈలు శ్రీనివాసరావు, భానుప్రకాశ్ వెల్లడించారు. మునగపాక మండలం వెంకటాపురం పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదని ఈఈ రామకృష్ణ తెలిపారు. నక్కపల్లి మండలం బంగారమ్మపేటలో ఉదయం 8 నుంచి 12 వరకు సరఫరా ఉండదని ఏఈ కృష్ణ తెలిపారు.

వేడుకగా మరిడిమాంబ పండగ

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జంపపాలెంలో మరిడిమాంబ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా


అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

?: అనకాపల్లిలోని మళ్లవీధిలో వీధికొళాయిల పైప్‌లైన్లు మురుగుకాలువల నుంచి వెళ్తున్నాయి. వీటిని మార్చి నీరు కలుషితం కాకుండా చూడగలరు. – ప్రభావతి, అనకాపల్లి

✓: సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – హరీష్, జీవీఎంసీ తాగునీటి విభాగం ఏఈ, అనకాపల్లి


స్వర్ణకవచంలో దుర్గాదేవి..


నునపర్తిలో..


గాయిత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి..


బాలాత్రిపుర సుందరీదేవిగా..


దత్తక్షేత్రంలో దుర్గాదేవి


లింగాపురంలో బోనాలతో ఊరేగింపు

కరుణించు కనకదుర్గ

అనకాపల్లి/ పట్టణం, కశింకోట, లక్ష్మీదేవిపేట, న్యూస్‌టుడే: దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఊరూరా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు స్వర్ణ కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి గాయిత్రీదేవి అలంకరణలో దర్శమిచ్చారు. విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయానికి తాళ్లపాలెం నుంచి భవానీ భక్తులు కాలినడకన బయలుదేరారు.

అచ్యుతాపురం, ఎలమంచిలి, మునగపాక: హరిపాలెం-అందలాపల్లి శ్రీభగీరథీ, నునపర్తి కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఎలమంచిలి, మునగపాకల్లోనూ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని బృందావనం దుర్గాలమ్మ చెట్టు, లింగాలతోట కాలనీ, దుర్గానగర్, 'వై' కూడలి వద్ద ఉన్న అమ్మవారి ఆలయాల్లో గురువారం మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. నక్కపల్లి, కాగిత, లింగాపురం గ్రామానికి చెందిన భవానీ భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

దసరా ఉత్సవాలకు శ్రీకారం


అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ ఆలయంలో గురువారం దసరా ఉత్సవాలను ఎంపీ సీఎం రమేష్ జ్యోతి ప్రారంభించారు. ఆలయంలో హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈఓ ఎన్.సుజాత, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, తెదేపా జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.




నక్కపల్లిలో..


కశింకోటలో అమ్మవారి ఘటాలతో..


అనకాపల్లి మండలంలో..


ఎస్.రాయవరంలో..


అందలాపల్లిలో..

పేదల ఆకలితో జగన్ రాజకీయాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పేదవాడి ఆకలితో జగన్ ఐదేళ్లు రాజకీయాలు చేశారని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మండిపడ్డారు. ఎలమంచిలిలో గురువారం అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి పేదలకు స్వయంగా ఆహారాన్ని వడ్డించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఆదుకోవాల్సిన జగన్ ఇది చేయకుండా తెదేపా తీసుకొచ్చిన అన్న క్యాంటీన్లు ఐదేళ్లు మూసివేసి పైశాచిక ఆనందం పొందారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీర్చిందన్నారు. ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, నాయకులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, కరణం రవికుమార్, లాలం సోమునాయుడు, కోటారి సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి గ్రామీణం: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. లైనుకొత్తూరులో మండల సమాఖ్య వార్షికోత్సవాన్ని నిర్వహించారు. లాలం సోమునాయుడు, లోవరాజు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే సుందరపు, రమాకుమారి

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ


చెక్కు అందిస్తున్న రామకృష్ణ

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: వెంకుపాలేనికి చెందిన హిమాన్షు కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులకు సంబంధించి రూ.2 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును పట్టణంలోని జనసేన కార్యాలయంలో గురువారం అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ ఈ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల పాత్ర ప్రశంసనీయం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సంఘ పాత్ర ప్రశంసనీయమని ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ గెల్లా జయబాబు పేర్కొన్నారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కళాశాలను నాక్ బృందం సందర్శించి డబుల్ ప్లస్ గుర్తింపు ఇచ్చిందన్నారు. కళాశాల పూర్వ ప్రిన్సిపల్ కేఎస్ ఈశ్వరరావు పూర్వ విద్యార్థుల సంఘానికి రూ. 50 వేల చెక్కును సంఘ ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, రాజు, జగదీశ్వరరావులకు అందజేశారు. దాతలు డాక్టర్ కేఎస్ ఈశ్వరరావు, పెంటకోట సూరిబాబులను సత్కరించారు. అప్పారావు, రాజు, జగదీశ్వరరావు, లక్ష్మణ్‌కుమార్, సూర్య సత్యనారాయణ పాల్గొన్నారు.


కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఈశ్వరరావు సత్కరిస్తున్న ప్రతినిధులు

కుళాయి నుంచి బురదనీరు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో గురువారం కుళాయిల నుంచి బురద నీరు వచ్చింది. చేనేత కాలనీకి సరఫరా చేసిన నీరు తొలుత బాగానే వచ్చినా, తర్వాత ఎరుపు రంగులోకి మారింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఏఈ నాగభూషణం దృష్టికి తీసుకెళ్లగా పైపులో లీకేజీలను పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు.



6న పరిషత్తు నాటికల ప్రదర్శన

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో ఈనెల 6న నిర్వహించే పరిషత్తు నాటిక ప్రదర్శనలు విజయవంతం చేయాలని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ సభ్యులు టెక్కలి వీరకొండలరావు కోరారు. మునగపాకలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆడారి సోమశేఖర్, మళ్ల కృష్ణ, వేగి కృష్ణ, నాయకులు కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట వెంకటరావు, పెంటకోట వెంకటి, ఎం.ఎం నాయుడు పాల్గొన్నారు.

నాటకోత్సవాలు ప్రారంభం


ప్రదర్శనలు ప్రారంభిస్తున్న దాడి

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకం సజీవమన్నారు. నాటకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనకాపల్లి కళలకు, క్రీడలకు పెట్టింది పేరన్నారు. ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, పోటీల పర్యవేక్షకులు కె.ఎం.నాయుడు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కె.సన్యాసినాయుడు, కొణతాల మురళి పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా వెలగలేరుకు చెందిన కళాకారులు 'రాత', హైదరాబాద్‌కు చెందిన వారు 'అజరామరం' నాటికలు ప్రదర్శించారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: గ్రామాల సమస్యల పరిష్కారానికి సభలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కైలాసపట్నం సచివాలయంలో గ్రామ కార్యదర్శి సంతోషి లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కర్రివానిపాలెం గ్రామసభకు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సత్యనారాయణ హాజరయ్యారు. నక్కపల్లి పంచాయతీలో సర్పంచి జయరత్నకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మార్టూరు క్వారీల్లో అక్రమ పేలుళ్లు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన నాయకుడు పొల్నాటి అప్పారావు ఆరోపించారు. మార్టూరులో జరిగిన గ్రామసభలో మాట్లాడారు.


ఓటు దరఖాస్తు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటరు నమోదు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అర్హులైన ఓటరు నమోదు ప్రక్రియ మొదలైంది. నవంబరు ఆరు వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ ఆధ్వర్యంలో గురువారం పలువురు ఓటు దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. అర్హులైన ఉపాధ్యాయులంతా నమోదు చేయించుకోవాలని డి.జి.నాథ్ కోరారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

రాష్ట్రస్థాయి పోటీలకు వేచలం విద్యార్థులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు వేచలం జడ్పీ పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. విద్యార్థులు బి.చైతన్య, వి.నారిబాబు, బి.రవిశంకర్, ఆర్.భారతిని ప్రధానోపాధ్యాయుడు డి.నరసింహమూర్తి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మునాయుడు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

రావికమతం: టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. జయ, జానకి, లక్ష్మి యమున అండర్-14 పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఈనెలాఖరున కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌నాయుడు చెప్పారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **జోకర్ ఫోలి అడు, కలి, సత్యం సుందరం,** ఆడి2: **స్వాగ్** ఆడి3: **దేవర,** ఆడి4: **దేవర, సత్యం సుందరం** రాజు:**స్వాగ్,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **మత్తు వదలరా,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కె.కోటపాడు: కింతాడ ఫీడరు పరిధిలో శుక్రవారం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ చంద్రశేఖర్ చెప్పారు. బత్తివానిపాలెం, కింతాడ, గొంపవానిపాలెం, కె.సంతపాలెం, జోగన్నపాలెం, చంద్రయ్యపేట, ఆర్లి, ఎరకన్నపాలెంకు సరఫరా ఉండదన్నారు.

రోలుగుంట: బి.బి.పట్నం, రత్నంపేట, అర్ల, గంగవరం, పనసలపాడు, పెదపేట, సింగరాజుపేట, చినపెదపేట, ఎర్రన్నపాలెం, ముంగర్లపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ రామకృష్ణారావు తెలిపారు.

కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక

నర్సీపట్నం అర్బన్: బలిఘట్టం వినాయకుడి గుడిలో సంస్కృతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. 120 మందిని పరీక్షించగా 30 మందికి కంటిశుక్లాల శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరికి విశాఖపట్నంలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

చీడికాడ, న్యూస్‌టుడే: ఎంపీడీఓగా హేమసుందరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పరవాడ మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి ఎంపీడీవో జయప్రకాశరావు పాయకరావుపేట బదిలీ అయ్యారు.

అటవీ రేంజ్ అధికారిగా శ్రీనివాసరావు

కృష్ణదేవిపేట: కృష్ణదేవిపేట అటవీ రేంజ్ అధికారిగా గురువారం కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకట్రావు బదిలీపై వెళ్లారు. సీలేరు అటవీ రేంజ్ అధికారిగా పనిచేసిన శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్, సిబ్బంది ఎరుకులమ్మ, సత్యనారాయణ ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

గిరిజనులకు దోమతెరల పంపిణీ

రావికమతం: గుడ్డిప శివారు జి.గదబూరుకు చెందిన 20 గిరిజన కుటుంబాలకు గురువారం దోమతెరల పంపిణీ జరిగింది. ప్రభుత్వం సరఫరా చేసిన వీటిని పీహెచ్‌సీ ద్వారా అందజేసినట్లు సర్పంచి గణేశ్వరరావు చెప్పారు.

భాజపాలో చేరిక

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: కింతలి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు జామి చిన్న గురువారం భాజపాలో చేరారు. ఆయనకు ఎంపీ సీఎం రమేశ్ భాజపా కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎం.కోడూరు సహకార సంఘం అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్ పాల్గొన్నారు.

ఉద్యమంలా తెదేపా సభ్యత్వాల నమోదు

నాతవరం: తెదేపా సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని మండల తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం నాతవరంలో జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.రమణ మాట్లాడుతూ అర్హులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదిస్తామన్నారు. పారుపల్లి కొండబాబు, విజయకుమార్, సన్యాసిదేముడు, మరిడియ్య, రజాక్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

నాతవరం: భారీ వర్షాలతో డొంకాడ అగ్రహారం గ్రామంలోని గొర్లె నూకాలమ్మ గృహం పాక్షికంగా శిథిలమైంది. దీంతో ప్రభుత్వం సాయంగా రూ. 10 వేలు మంజూరు చేసింది. ఈ చెక్కును ఉప తహసీల్దారు రాజు గురువారం కుటుంబ సభ్యులకు అందించారు.

తపాలా ఉద్యోగికి ప్రజల్లో గుర్తింపు

నాతవరం: ప్రజల్లో తపాలా ఉద్యోగికి మంచి గుర్తింపు ఉందని మండల తెదేపా అధ్యక్షులు వెంకటరమణ పేర్కొన్నారు. మర్రిపాలెంలో పోస్టుమాస్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తాతబాబును స్థానికులు సత్కరించారు.

నేరాల నియంత్రణ ఎలా?

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

జిల్లాలో కీలకమైన నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌కు తగినంత సిబ్బంది లేరు. మూడునెలలుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ చేయలేదు. ఆరుగురు ఎస్సైలకు గాను ప్రస్తుతం ఇద్దరే విధుల్లో ఉన్నారు. ఒకరు ట్రాఫిక్, మరొకరు పరిపాలన చూస్తున్నారు. తక్కువ సిబ్బందితో నేరాల నియంత్రణ ఎలా సాధ్యమన్నది ప్రశ్నార్థకం. శాశ్వత సీఐ లేక పోలీసు వెరిఫికేషన్ డిజిటల్ సర్టిఫికెట్లు ఇవ్వడం వీలు కావడం లేదు. కొన్ని పోస్టులకు డిజిటల్ సర్టిఫికెట్లు అడుగుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

నర్సీపట్నం టౌన్ స్టేషన్‌కు ఎక్కువగా వేధింపులు, కొట్లాటలు, గొడవల వంటి ఫిర్యాదులు వస్తుంటాయి. సీఐ ఉన్నప్పుడు సాధారణంగా ఇరువర్గాలను కూర్చోబెట్టి రాజీమార్గంలో పరిష్కరించేవారు. ఇలాంటి ఫిర్యాదులున్న వారు ఇప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పోలీసు విధులన్నీ ఓ పద్ధతి ప్రకారం సాగిపోతుంటాయి. సిబ్బంది కొరత వల్ల సమతుల్యత దెబ్బతింది. దిగువ స్థాయి సిబ్బందిపై అజమాయిషీ కరవైంది.


నర్సీపట్నం మోడల్ పోలీసు స్టేషన్

« నర్సీపట్నంలో గంజాయి మత్తుకు అలవాటు పడిన బృందాలు తరచూ గొడవలకు దిగుతుంటాయి. ఒక్కోసారి కొట్లాడుకుంటుంటారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు అప్పుడప్పుడు ఎదురవుతుంటాయి. పట్టణ శివార్లలో సారా తయారీకి కొన్ని ప్రాంతాలు పేరొందాయి. కొద్దిరోజుల క్రితం ఇన్‌ఛార్జి సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది ఓ సారా బట్టీ గుర్తించి ధ్వంసం చేయడం తెలిసిందే. రౌడీషీటర్లు ఎక్కువగా ఉన్నారు.

సిబ్బంది కొరత వల్ల వీరందరిపై నిఘా ఉంచడం సాధ్యం కాని పరిస్థితి ఉంది. విద్యల నిలయమైన నర్సీపట్నంలో వేల మంది కళాశాలలకు వచ్చి వెళ్తుంటారు. బస్టాండ్ ప్రాంతం సాయంత్రమైతే రద్దీగా ఉంటుంది. కొంతమంది ఆకతాయిలు అమ్మాయిల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారు. విపరీతమైన శబ్దంతో బైకులు నడుపుతూ శబ్దకాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. బైకు, పెట్రోలు చోరీలు సాధారణమయ్యాయి. కొద్దిరోజుల క్రితం గ్రామీణ బ్యాంకు సమీపంలో, అబీద్ కూడలి పూల దుకాణాల ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు జరిగాయి. సెల్‌ఫోన్లు తస్కరించుకుపోయేవారు ఉంటున్నారు. ఐదు స్టేషన్ల బాధ్యతలు చూస్తున్న గ్రామీణ సీఐకి కీలకమైన టౌన్ స్టేషన్ ఇన్‌ఛార్జి బాధ్యత అప్పగించారు. టౌన్ స్టేషన్‌కు సీఐని, అవసరమైన ఎస్సైలు, ఇతర సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

నిఘాకూ ఇబ్బందులే!

సాధారణంగా పోలీసులు మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు, రాత్రి తొమ్మిది నుంచి పది గంటల మధ్యలో రోడ్లపై అంతగా కనరారు. ఈ సమయంలో నేరాళ్లు తమ పనులను చక్కబెట్టేస్తుంటారు. సిబ్బంది ఎక్కువగా ఉంటే ఈ సమయంలోనూ నిఘా ఉంచేదుకు వీలుంటుంది. గతంలో ఐదు రాత్రి గస్తీ బృందాలు ఉండేవి. ఇప్పుడు ఒకటి ఉంది. అనకాపల్లి మున్సిపాలిటీ కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన నర్సీపట్నంలో ఒక గస్తీ బృందం ఏ మేరకు అప్రమత్తంగా ఉండగలదన్నది ప్రశ్నార్థకం.

తవ్వేవారు ఆగరు.. అడగాల్సినవారు అడ్డుకోరు!

గొలుగొండ, న్యూస్‌టుడే

ఇసుక ఉచితమే.. కానీ వంతెనలు, ఆనకట్టలు, తాగునీటి పథకాల వద్ద తవ్వకాలు నిషిద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అక్రమార్కులు మాత్రం ఈ నిబంధనలను లెక్క చేయడం లేదు. తాండవ జలాశయానికి ప్రధాన నీటి వనరైన బొడ్డేరు గెడ్డలో విచ్చలవిడిగా ఇసుక తవ్వేస్తున్నారు. ట్రైలర్‌బళ్లలో తరలించి ధైర్యంగా కృష్ణదేవిపేట ప్రధాన రహదారి పక్కనే పోగులుగా పోస్తున్నారు. అనంతరం దీనిని ట్రాక్టర్లకు లోడు చేసి దూరాన్నిబట్టి రూ. 4 వేల నుంచి రూ. 5 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తెల్లవారుజాము 4 గంటలకు మొదలెట్టి ఉదయం 11 గంటల వరకు సుమారు 50 బళ్ల వరకు తోడేస్తున్నారు. దీంతో చోద్యం-కొయ్యూరు మండలం కంఠారం మధ్య కొత్త వంతెన రక్షణ గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. లింగంపేట వద్ద రూ. కోటితో నిర్మించిన భారీ తాగునీటి పథకానికి ముప్పు తప్పదని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు. ఇష్టారాజ్యం తవ్వకాలతో మూడు జిల్లాలకు అనుసంధానంగా ఉండే గుజ్జుమానుపాకల వద్ద బ్రిటిష్ కాలం నాటి వారధి పునాది రాళ్లు కొట్టుకు పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వెయ్యి ఎకరాలకు సాగు నీరందించే విప్పలపాలెం ఆనకట్ట బలహీన పడుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై ట్రాక్టర్, ట్రైలర్‌బళ్ల యజమానులను కొద్దిరోజుల కిందట స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేసి ఇసుక తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా ఖాతరు చేయకుండా దందా కొనసాగిస్తున్నారు.

✦ ఇసుక అక్రమాలపై ఎస్సై దివ్య వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే తమ సిబ్బందితో నిఘాపెట్టి పట్టుబడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


చోద్యం వంతెన దగ్గర గెడ్డలో తవ్వి తరలిస్తున్న ఇసుక


రహదారి పక్కనే ట్రాక్టరులో ఇసుక లోడింగ్


దుర్గమ్మను దర్శించుకుంటున్న రాజేష్, దివ్య దంపతులు


మహిషాసురమర్దిని ప్రదర్శనలో విద్యార్థినులు


బలిఘట్టంలో బాలికల పూజలు


చోడవరం బానయ్య కోనేరు వద్ద మండపంలో..

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పలు ప్రాంతాల్లో దుర్గాదేవి బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెదేపా కౌన్సిలర్ చింతకాయల రాజేష్, దివ్య దంపతులు నర్సీపట్నం, బలిఘట్టాల్లోని దుర్గామల్లేశ్వర స్వామి, పెదబొడ్డేపల్లి సరస్వతిదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. దుర్గాదేవి దీక్షా మాలధారణ కోసం వేల మంది భక్తులు ఉదయాన్నే పట్టణానికి తరలివచ్చారు. దీంతో శ్రీకన్యకూడలి, అబీద్‌కూడలి, ఉత్తరవాహిని రోడ్లు రద్దీగా మారాయి. మాకవరపాలెం మండలం గిడుతూరు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజజలు చేశారు. చోద్యంలో అమ్మవారి బొందలరాజు ఆధ్వర్యంలో దుర్గాదేవి ప్రతిమను ఊరేగించారు.

రావికమతం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కొత్తకోట, రావికమతం, మేడివాడ, చినపాచిల, గుమ్మళ్లపాడు, గుడ్డిప, టి.అర్జాపురం, దొండపూడి గ్రామాల్లో దుర్గాదేవి భక్తులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో అమ్మవారి నిలువెత్తు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. కొత్తకోట, గుడ్డిపలో మహిళలు పిండి వంటలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు.

చీడికాడ, కె.కోటపాడు: అప్పలరాజుపురం మెట్టపై శరన్నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజున అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. అయ్యన్న విద్యా సంస్థల విద్యార్థులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి బొమ్మల కొలువు నిర్వహించారు. కె.కోటపాడు పాఠశాలలో నవదుర్గల వేషధారణ, మహిషాసుర మర్దిని ప్రదర్శనలో విద్యార్థినులు అలరించారు.

చోడవరం, దేవరాపల్లి, రోలుగుంట: చోడవరం పట్టణంలో బానయ్య కోనేరు వద్ద పేదల సంఘం, భవానీ ఆధ్వర్యంలో పండల్ ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దేవరాపల్లి ఆటో స్టాండుతోపాటు సీతంపేట, చిననందిపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన మండపాల్లో దుర్గాదేవి ప్రతిమలను నెలకొల్పారు. రోలుగుంట, కుసర్లపూడి, కొంతలం, శరభవరం, బుచ్చెంపేట గ్రామాల్లో మండపాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు.


కొత్తకోటలో సారె ఊరేగింపు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మాడుగుల శ్రీదేవి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షుడు కొండలరావు గౌరవాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాజీ ఎంపీపీ రామధర్మజ వెండి ధనుస్సును అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు, సర్పంచి కళావతి, దంగేటి సూర్యారావు పాల్గొన్నారు.

మోదమాంబకు వెండి ఆభరణాల బహూకరణ


అర్చకులకు వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు, గ్రామపెద్దలు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఎం.కోడూరులో కొలువుదీరిన మోదమాంబ అమ్మవారికి అర కేజీ వెండితో తయారు చేయించిన విష్ణుచక్రం, త్రిశూలంను దాతలు గురువారం బహూకరించారు. గ్రామానికి చెందిన శానాపతి గణేష్, పడాల శ్రీనివాసరావు, నానుబిల్ల శ్రీనివాసరావు వీటిని సర్పంచి సంజీవి చేతుల మీదుగా అర్చకులకు అందజేశారు. అప్పలనాయుడు, వెంకటనారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు రమణబాబు, ఏసు పాల్గొన్నారు.

కాలినడకన కనకదుర్గమ్మ దర్శనానికి..

గొలుగొండ/కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకోడానికి లింగంపేట నుంచి ఐదుగురు మాలధారులు గురువారం కాలినడకన బయలుదేరారు. దసరానాటికి అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కు తీర్చుకుంటామని నర్సింగరావు, తాతాజీ, నాగేశ్వరరావు, ప్రసాదు తెలిపారు.


లింగంపేట నుంచి విజయవాడ బయలుదేరుతున్న భక్తులు

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

గొలుగొండ, న్యూస్‌టుడే: వరి పైరులో చీడపీడలు సకాలంలో నివారించకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త పి.బాబు అన్నారు. కొత్తఎల్లవరంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పంటలను పరిశీలించి అన్నదాతలకు పలు సూచనలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని వివరించారు. మండల వ్యవసాయాధికారి సుధారాణి, సర్పంచి కొల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: వరిలో జీవన ఎరువుల వినియోగంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారిణి రమాదేవి రైతులకు సూచించారు. ఖండివరం, ఎల్.బి.పట్నంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు.


వేములపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: వరిలో అధిక దిగుబడునిచ్చే వంగడాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారి వాసుదేవరావు రైతులకు సూచించారు. ఎం.కోటపాడు, ముకుందపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీఎల్, సాంబమసూరి, స్వర్ణ రకాలే కాకుండా ఇంద్ర, అమర, మార్టేరు సాంబ, శ్రీధృతి రకాలనూ సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్త రాజ్‌కుమార్, సౌజన్య పాల్గొన్నారు.

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు గురువారం వేములపూడి, బలిఘట్టం పొలాలను సందర్శించారు. పొటాష్ లోపాన్ని సవరించుకునే విధానాన్ని, ప్రకృతి వ్యవసాయంతో జరిగే మేలును సహాయ సంచాలకులు శ్రీదేవి రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి అప్పారావు, అభ్యుదయ రైతు బోళెం రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జునగిరిలో తాగునీరు కలుషితం


కుళాయి నుంచి వస్తున్న రంగు మారిన నీరు

చీడికాడ, న్యూస్‌టుడే: అర్జునగిరిలో కుళాయిల నుంచి బురద నీరు వస్తోంది. జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినప్పటి నుంచి తరచూ రంగుమారిన నీరు వస్తోందని మహిళలు చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోని కుళాయిల నుంచి గురువారం కలుషిత నీరు వచ్చింది. అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మహిళా హక్కుల రక్షణకు ఎన్నో చట్టాలు


గొలుగొండలో మాట్లాడుతున్న వెంకటశేషమ్మ

గొలుగొండ, రావికమతం, న్యూస్‌టుడే: దేశంలో మహిళల హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. రావికమతం, గొలుగొండలో గురువారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులకు ఆమె హాజరై మాట్లాడారు. చట్టాలపై తగిన అవగాహన పెంచుకోవాలని సూచించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సమన్యాయం అందుతుందని తెలిపారు. కుటుంబంలో వచ్చే చిన్నపాటి వివాదాలకు కోర్టుల చుట్టూతిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. బాధితులకు న్యాయస్థానాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని తెలిపారు. నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ, ప్రాంతీయ సమన్వయకర్త రత్నప్రభ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, సీఐలు కుమారస్వామి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రావికమతం సదస్సుకు హాజరైన మహిళలు

వడ్డాది గ్రామసభ రసాభాస

పోలీసులకు ఈవో ఫిర్యాదు

బుచ్చెయ్యపేట: వడ్డాది పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో గొడవ చోటుచేసుకుంది. పంచాయతీ ఈవో లోవరాజుపై భాజపా కార్యకర్త శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర చేయిచేసుకున్నాడు. ఈ పరిణామంతో కంటతడి పెట్టిన ఈవో పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామసభలో వివిధ శాఖలకు చెందిన సిబ్బంది తమ పనితీరును వివరిస్తుండగా వార్డు సభ్యుడు, తెదేపా పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభకు ప్రజలెవరూ హాజరుకాకుండా మొక్కుబడిగా నిర్వహించడం ఎందుకని నిలదీశారు. భాజపా కార్యకర్త చినవెంకయ్యదొర మాట్లాడుతూ.. పంచాయతీ నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపించారు. దీనిపై ఉప సర్పంచి దాడి సూరినాగేశ్వరరావు స్పందిస్తూ నిరాధర ఆరోపణలు చేయవద్దని హితవు పలికారు. చినవెంకయ్యదొర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేదికపై ఉన్న మంచినీళ్ల సీసాను నేలకేసి కొట్టగా అది ఈవో లోవరాజుకు ఆ సీసా తగిలింది. పెద్దగా కేకలు వేస్తూ ఈవోపై చేయి చేసుకున్నాడు. సభ రసాభాసాగా మారడంతో అధికారులు, సిబ్బంది అక్కడనుంచి వెళ్లిపోయారు. తనపై దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని పేర్కొంటూ చినవెంకయ్యదొరపై ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులకోసారి పంచాయతీ కార్యాలయానికి వచ్చి విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీహెచ్.నాగాపురంలో బహిష్కరణ

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురంలో గురువారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్థులు, పంచాయతీ వార్డు సభ్యులు బహిష్కరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సర్పంచి, పంచాయతీ సిబ్బంది చేసిన పనులకు సంబంధించి రికార్డులు చూపకపోవడంతో గ్రామస్థులు అసహనానికి గురయ్యారు. దీంతో సభనుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి కొలగాని రామారావు, తెదేపా సీనియర్ నాయకుడు బొప్పన ప్రసాదు మాట్లాడుతూ గ్రామంలో జరిగిన పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించి, దర్యాప్తు చేయాలని కోరారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రాధాన్యాల వారీగా గుర్తించనున్నట్లు కుసర్లపూడి సర్పంచి అప్పలనాయుడు పేర్కొన్నారు. గాంధీ కుసర్లపూడిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు.

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని మాజీ సర్పంచి చిటికెల సాంబమూర్తి తెలిపారు. గురువారం కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం, పాతమల్లంపేట, అమ్మపేట, సీహెచ్.నాగాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. గత నాలుగేళ్ల పంచాయతీ పాలనలో జరిగిన అభివృద్ధి, ఇకపై చేయాల్సిన పనులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచి పోలిరెడ్డి రాజుబాబు, ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డు సీత, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఆదాయం మెరుగుకు చర్యలు తీసుకోండి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా జనసేన పార్టీ వార్డు ఇన్‌ఛార్జులు కమిషనర్ జంపా సురేంద్రను గురువారం కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో వీరంతా పట్టణంలోని సమస్యలను వివరించారు. రోడ్డు విస్తరణ కోసం గతంలో కూలగొట్టిన స్టేడియం ముందు దుకాణాల స్థానంలో కొత్తవి నిర్మిస్తే మున్సిపాలిటీకి మంచి ఆదాయం వస్తుందని సూచించారు. కుక్కలు, పందుల బెడద నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వీరంతా అంతకు ముందు స్థానిక ఆర్‌డీఓ వి.వి.రమణను మర్యాదపూర్వకంగా కలిశారు.


కమిషనర్ సురేంద్రకు మున్సిపాలిటీలోని సమస్యలను వివరిస్తున్న జనసేన నాయకులు

నూకాలమ్మ ఆలయం వద్ద భజన

గొలుగొండ, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రాయశ్చిత్త దీక్ష విరమించిన పవన్ కల్యాణ్‌కు సంఘీభావంగా గురువారం లింగంపేట నూకాలమ్మ ఆలయంలో జనసైనికులు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర మాట్లాడుతూ సనాతన ధర్మంతోనే సమాజానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దొర బాబు, శివ, స్వామినాయుడు తోపాటు తెదేపా నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవనాలను పూర్తి చేద్దాం

చోడవరం, న్యూస్‌టుడే: ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేద్దామని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు అధికారులకు సూచించారు. రైతుబజారు, తహసీల్దారు కార్యాలయ భవన నిర్మాణాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వార్డుల్లో కల్యాణ మండపాల నిర్మాణాలు ఆగిపోయాయని, వాటినీ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, ఏఈ శాంతరాం, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు డీవీ అప్పారావు, వార్డు సభ్యులు హరి, జోగినాయుడు పాల్గొన్నారు.


రైతుబజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు, డీఈఈ ప్రసాద్, ఎంపీడీఓ ఆంజనేయులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి-2 ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ-3 ఈశా పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని మహిళా ప్రగతి కేంద్రం, వెలంపేట, చిన్నముషిడివాడ ఏరియా, ప్రగతినగర్, జ్యోతి కాలనీ, సుజాతానగర్ ప్రాంతం, సాయి ఐటీఐ, పాత పెందుర్తి, ఎల్ఐసీ కాలనీ, పశువుల ఆసుపత్రి ఏరియా, పెందుర్తి మార్కెట్, రాతిచెరువు ప్రాంతం, తహశీల్దారు మార్కెట్, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

పెందుర్తి

ఆధునాతన పద్ధతులతో అధిక దిగుబడి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి సీహెచ్ చంద్రావతి పాల్గొని మాట్లాడారు. రైతులంతా ఆధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత గ్రామంలోని వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: సబ్బవరం నుంచి అమృతపురం వెళ్లే దారిలో గండివానీ ఇళ్ల సమీపంలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కాలువ నిర్మించాలి. - జి.శ్రీరాములు, బోడుగుళ్ల

సమాధానం: పంచాయతీ సమావేశంలో పాలకవర్గ సభ్యుల దృష్టికి తీసుకెళ్లి కాలువ నిర్మాణానికి కృషి చేస్తాం. - కె.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సబ్బవరం

చెరువులకు జలకళ..


నిండుకుండలా పైడమ్మబంద


పరవాడ పెద్దచెరువు నిండి దిగువకు ప్రవహిస్తున్న నీరు

పరవాడ, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ పరవాడలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండలు, గెడ్డవాగుల నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో తటాకాల్లో నీటి నిల్వలు పెరిగి నిండుకుండలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పరవాడ పెద్దచెరువు, పైడమ్మబంద, గొల్లమ్మబంద, సన్యాసి, కోనాం ఊరచెరువులు నిండి నీరు కిందకు ప్రవహిస్తోంది. చెరువుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉండటం వల్ల భూగర్భ జలమట్టం పెరుగుతోందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వరికి నీటి ఇబ్బందులు ఉండవని రబీ పంట వరకు ఈ నీరు సరిపోతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలు చెరువుల గట్లు గండ్లు పడినప్పటికీ కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి వాటిని పూడ్చడంతో నీటితో కళకళలాడుతున్నాయి.


కళకళలాడుతున్న ఊరచెరువు

ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించండి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి మండలి సమావేశాన్ని గురువారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు శాంతి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి 2024 సంవత్సరం మొదటి విడతగా రూ. 43,500 వచ్చాయన్నారు. ఇటీవల పిడుగులు, వర్షాల కారణంగా విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చి ఆసుపత్రిలో ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వ్యర్థాలను(బయోమెడికల్) ఎప్పటికప్పుడు తరలించాలని దీనికి కావలసిన నీలం, పసుపు, ఎరుపు రంగు సంచులను కొనాల్సి ఉందన్నారు. అదే విధంగా ప్రసూతి గది తలుపులు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని బాగు చేయాల్సి ఉందన్నారు. ఒప్పంద కార్మికులు(కంటింజెంట్ వర్కర్స్)కు వేతనాలను వెంటనే చెల్లించాలని కమిటీ అధ్యక్షురాలు సూర్యకుమారి సూచించారు. ఆయా పనులకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో సర్పంచి బండారు మంగ, బైలపూడి గౌరి, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, అధికారులు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

పరవాడ, న్యూస్‌టుడే: ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచి చింతకాయల సుజాత అన్నారు. స్థానిక సచివాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, ఎన్టీపీసీ సీఎస్ఆర్, జల జీవన్ మిషన్ నిధులు రూ. 1.50 కోట్లు వెచ్చించి ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట, సమ్మెంగిపాలెం గ్రామాల్లో సీసీరోడ్లు, మంచినీటి కుళాయిలు తదితర 20 రకాల పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చింతకాయల ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాయకులు మైలపల్లి అప్పన్న, చింతకాయల అమ్మోరు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి సుజాత

44 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ మహిళ నుంచి 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. పరవాడకు చెందిన దేవి తన ఇంటి వద్ద విక్రయించేందుకు మద్యం సీసాలను అక్రమంగా తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వి.అంబేద్కర్‌ను గురువారం జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. వార్డులోని దీర్ఘకాలంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారును కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఆయన వెంట తెదేపా నేత రౌతు మూర్తి తదితరులు ఉన్నారు.


తహసీల్దారుకు మొక్కను అందజేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

1330వ రోజుకు ఉక్కు దీక్షలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో పని చేస్తూ, ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి కార్మికులకు, కర్మాగారానికి తీరని నష్టం కలుగజేస్తుందని టీఎన్‌టీయూసీ నాయకులు బొడ్డు పైడిరాజు, సిటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో కొనసాగుతున్న దీక్షలు గురువారం 1330వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు శిబిరానికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసే వరకు కార్మికుల పోరు ఆగదన్నారు. కార్మికులు కె.గంగాధర్, నీలకంఠం, వి.ప్రసాద్, ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

ఉక్కులో బతుకమ్మ సంబరాలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ఉక్కునగరంలో నివాసం ఉండే తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సెక్టారు-8లోని మహాత్మా గాంధీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాట్లాడారు. దసరాను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.


రోబోటిక్స్ పోటీల్లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: దిల్లీలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈనెల 2న నిర్వహించిన రోబోటిక్స్ టెక్నాలజీ పోటీల్లో పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.శ్రీమహిత్‌రాజ్ ప్రతిభ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సీతాలక్ష్మి గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జూలియ(వియత్నాం) చేతులమీదుగా మహిత్‌రాజ్ అవార్డు అందుకున్నాడన్నారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు సీఈవో నిశాంత్, సమన్వయకర్త రామలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు మహిత్‌రాజ్‌ను అభినందించారు.


మహిత్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

వృత్తి విద్యతో మెరుగైన ఉపాధి

పెందుర్తి, న్యూస్‌టుడే: వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చునని జిల్లా గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో) ఖలీసా బేగం అన్నారు. పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వృత్తి విద్య ఇంటర్న్‌షిప్‌ను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆటోమొబైల్ కోర్సుకు సంబంధించి 15 మంది విద్యార్థులను స్థానిక మారుతీ సుజుకీ ఆటోమొబైల్ సంస్థలో శిక్షణకు పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రిషికేశ్, ప్రధానోపాధ్యాయిని చిన్నమ్మాయి, ఒకేషనల్ శిక్షకుడు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జీసీడీవో ఖలీసా బేగం, తదితరులు

అడుగుకో గుంత..


అమృతపురం రహదారిలో..

సబ్బవరం మండలంలోని రహదారులు ఎక్కడ చూసినా చెరువులను తలపిస్తున్నాయి. ఆ దారుల్లో ప్రయాణమంటే నానా పాట్లు పడాల్సిందే. లేదంటే గమ్య స్థానానికి చేరుకోవడం కష్టమే. వర్షాకాలంలో ప్రయాణం వాయిదా వేసుకోవాల్సిందే. అమృతపురం, మొగలిపురం గ్రామాల ప్రధాన రహదారుల దుస్థితి ఈ చిత్రాల్లో చూడొచ్చు.
- ఈనాడు, విశాఖపట్నం


మొగలిపురంలో రోడ్డులో..


వేంకటాద్రి ఘాట్ రోడ్డులోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో..


చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో రజత కవచం అలంకరణ


ఎస్ఆర్‌పురంలో..


అమ్మవారికి హారతిస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి


బాలాత్రిపురసుందరిగా నాయుడుతోట గాయత్రీ దేవి


మణిపురం భువనేశ్వరీ మాత

బాలాంబికా నమోస్తుతే..

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని జగన్మాత గురువారం బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. నియోజకవర్గంలోని వివిధ ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. నేతలు అమ్మవార్లను దర్శించుకున్నారు.
- న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


రాంపురంలో పూజల్లో పాల్గొన్న సర్పంచి శిరీష, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు తదితరులు



పెందుర్తి ప్రశాంతినగర్ కనకదుర్గమ్మ సన్నిధిలో జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు


దేవీపురం రాజరాజేశ్వరి


సంతబయలు వద్ద..


గవరజగ్గయ్యపాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, బండారు అప్పలనాయుడు


తానాంలో మాజీ జెడ్పీటీసీ పైలా జగన్నాథరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ, నేతలు


శారదాపీఠంలో..


సబ్బవరం దుర్గమాంబ


పరవాడ బొంకులదిబ్బ వీధిలోని అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి దంపతులు, కమిటీ ప్రతినిధులు


వెన్నెలపాలెం హనుమాన్‌కాలనీలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రోజు రోజుకు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సిటూ) సంయుక్తంగా గురువారం పెందుర్తి రైతుబజార్ వద్ద ధర్నా నిర్వహించాయి. ఆయా సంస్థల పెందుర్తి యూనిట్ నాయకులు బి.రమణి, కె.వెంకటలక్ష్మి, కె.అప్పలనాయుడు, ప్రభుదేవా, ఈశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజా జీవితం దుర్భరమవుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.



రైతు బజారు ఎదుట ధర్నా చేపడుతున్న ఐద్వా, సిటూ నాయకులు

బోనస్ చెల్లించాలని డిమాండ్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని కార్మికులకు, ఉద్యోగులకు 20 శాతం దసరా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఫార్మాసిటీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ఫార్మా యాజమాన్యాలు దసరా పండగ సందర్భంగా కార్మికులకు, ఉద్యోగులకు సెప్టెంబరు జీతానికి 20 శాతం కలిపి బోనస్ చెల్లించాలన్నారు. 20 కంటే ఎక్కువ మంది పనిచేసే కంపెనీల్లో 1965 బోనస్ చట్టం ప్రకారం చెల్లించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మణరావు, కె.శ్రీను, రామకృష్ణ, నాగేశ్వరరావు, రాజు, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీఐటీయూ ప్రతినిధులు, కార్మికులు

▼ అసంపూర్తి నిర్మాణానికి ఏడేళ్లు..

దర్పణం



ప్రభుత్వం అంగన్‌వాడీ కోసం రూ.10 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు కొంతమేర భవనం నిర్మించారు. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది.


అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది సబ్బవరం మండలం రాయపుర అగ్రహారంలోని అంగన్‌వాడీ భవనం. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2017లో అప్పటి తెదేపా అనంతరం నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఏడేళ్లు అవుతున్నా నేటికీ పూర్తి చేయలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సబ్బవరం

▼ అడ్డు తొలగించి.. ఆధునికీకరించి..





సబ్బవరంలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారడంతో విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో చేసేది లేక చెట్లను తొలగించి స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల తీగలకు అడ్డొచ్చిన కొమ్మల్ని మాత్రమే కొట్టి తీగలు అమర్చుతున్నారు.
- ఈనాడు, విశాఖపట్నం



రహదారి గుంతలు పూడ్చివేత

స్పందనకు వందనం

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెం నుంచి పరవాడ వెళ్లే మార్గంలోని ఈ.భోనంగి ఇండస్ట్రియల్ పార్కు సమీపంలోని తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద దెబ్బతిన్న రహదారికి గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గత కొంతకాలంగా ఇక్కడ రాకాసి గుంతలు ఏర్పడటంతో పాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవడంతో సీఐ ఆర్.మల్లికార్జునరావు స్పందించారు. రాంకీ సహకారంతో గుంతలను పూడ్చివేశారు.


గుంతలను పూడ్చుతున్న దృశ్యం